క్లుప్తంగా

బస్సు సౌకర్యం కల్పించాలి

గద్వాల క్రైం: జిల్లాలోని మారుమూల పల్లెలకు బస్సు సర్వీసులు లేని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మంగళవారం డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద వినతి పత్రం అందించారు. గట్టు, ధరూర్, కేటీదొడ్డి, అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు మండలాల్లోని మారుమూల పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థినీలకు బస్సు సౌకర్యం లేక పోవడంతో ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తున్నారని అన్నారు. సమస్యలను గుర్తించి బస్సు సౌకర్యం కల్పించాలని ఆమె పేర్కొన్నారు.

ఒకే గ్రామంలో ఆరుగురికి ఉద్యోగాలు

అయిజ: మండలంలోని ఒకే గ్రామంలో ఒకేసారి 6 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో ఆ గ్రామంలో ఆనందాలు వెల్లివిరిశాయి. చిన్నతాండ్రపాడు గ్రామంలోని సాయి రాఘవేంద్ర, లావణ్య, సుజాత, వీరేశమ్మ, జైపాల్, సుబాషినిలకు స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు వచ్చాయి. ఉద్యోగాలు సాధించిన యువతకు వివిధ పార్టీల, సంఘాల నాయకులతో పాటు గ్రామంలోని ప్రజలు అభినందనలు తెలిపారు.

సీడ్ ఆర్గనైజర్లపై చర్యలు తీసుకోవాలి

గద్వాల అర్బన్: రైతులతో సేకరించిన విత్తన పత్తిని కంపెనీలకు ఇవ్వకుండా ఆర్గనైజర్లు బయట మార్కెట్లో అధిక ధరకు అమ్ముకుంటున్నారని, దీని ప్రకారమే రైతులకు చెల్లింపులు చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దోపిడీకి పాల్పడుతున్న సీడ్ ఆర్గనైజర్లపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కన్వీనర్ బుచ్చిబాబు, లవన్న, విష్ణు, ప్రేమ్ రాజ్, తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

యువకుడికి సన్మానం



అయిజ: విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తూ లంచం అడిగిన వ్యక్తిని ఏసీబీ అధికారులకు పట్టించిన వీరేష్ ఆచారిని యువకులు సన్మానించారు. మంగళవారం మండల కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ తాహెర్, పట్టణ యువకులు శాలువా, పూలమాలతో వీరేష్ ఆచారిని సత్కరించారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ ప్రజలను లంచం డిమాండ్ చేసే అధికారులపై ఏసీబీ దాడులు నిర్వహించడం వల్ల కొంతమేర అవినీతి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో అశోక్, జాహీర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



అయిజ: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం పనులు ముమ్మరం చేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం లోపించిన పరిసర ప్రాంతాలను గమనించి వాటిని పరిశుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం పనులు చేస్తూ ఉండాలన్నారు. రోడ్లను శుభ్రంగా ఊడ్చాలని, మురుగు కాల్వల్లో ఎప్పటికప్పుడు మురుగును తొలగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోర్ మోటర్‌కు మరమ్మతు



మానవపాడు: మండలంలోని అమరవాయిలో మంగళవారం బోర్‌కు మరమ్మతులు నిర్వహించి మండల కో ఆప్షన్ మెంబర్ మహ్మద్ సిరాజ్ ప్రారంభించారు. నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో ఎర్రవల్లి సరస్వతి పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చి పతకాలను సాధించినట్లు పాఠశాల చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 27న హైదరాబాద్‌లో జరిగిన మూడో జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు.



గ్రామీణులకు అందని వైద్యం



ఉండవెల్లిలో ఆరోగ్య ఉప కేంద్రంలో బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- వైద్య సేవలకు పక్క రాష్ట్రానికి..
- ఎంఎల్‌హెచ్‌పీలను ఏర్పాటు చేసినా నిరుపయోగమే..
- మారుమూల ప్రాంతాల ప్రజలకు అందని వైద్య సేవలు

ఉండవెల్లి: గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్య సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో పక్క రాష్ట్రమైన కర్నూల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండలాల్లో పీహెచ్‌సీలు, ఉప కేంద్రాలున్నా వైద్యులు ప్రజలకు వైద్యం చేయలేక చేతులెత్తేస్తున్నారు. దీంతో పక్కనున్న కర్నూల్‌కు పోవాల్సి వస్తోంది. ప్రభుత్వం మారితే చికిత్స బాగుంటుందని సంతోషించినా, ఇప్పటికీ మూసిన ఆస్పత్రిని తెరవకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

అలంపూర్ నియోజకవర్గంలో ప్రైవేట్ వైద్యమే..

అలంపూర్ నియోజకవర్గంలోని అలంపూర్, మానవపాడు, రాజోళి, అయిజ, ఇటిక్యాల మండలాల్లో పీహెచ్‌సీలున్నా, వ్యాధి త్వరగా తగ్గాలని ఖర్చు పెడుతూ కమిషన్ ఏజెంట్ల ద్వారా మోసపోతున్నారు. ప్రాణాపాయంలో ఉంటే ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందే కర్నూల్ వెళ్లండని చెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో ఆరోగ్యశ్రీ కార్డును మాజీ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చారు. రాష్ట్రాలు వేరయ్యాక తెలంగాణ ప్రభుత్వం నిలిపేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని తెలపడంతో ఆపరేషన్ చేయించుకోవడానికి బాధితులు చాలా మంది ఉన్నారు.



జాతీయ రహదారిపై ప్రమాదాలకు గురైతే ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

చికిత్సకు కర్నూలుకు వెళ్తాం..



జాతీయ రహదారిపై మా గ్రామానికి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగి కాలు విరిగింది. ఈ క్రమంలో కర్నూల్‌కు వెళ్లి చికిత్స చేయించాం. వైద్యం అలంపూర్‌లో లేక పోవడం వల్లనే కర్నూల్‌కు వైద్యం కోసం వెళ్లాల్సి వస్తోంది. అలంపూర్ చౌరస్తాలో ఆస్పత్రిని ప్రారంభించి వైద్య సేవలు అందించాలి.

– జగదేవయ్య, ఉండవెల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

గ్రామీణ ప్రాంతాలకు వైద్యం అందనిది వాస్తవమే. కానీ ఆరోగ్య ఉప కేంద్రాలలో కొన్ని చోట్ల ఎంఎల్‌హెచ్‌పీలను ఏర్పాటు చేశాం. ఏదైనా అత్యవసర చికిత్స కోసం గద్వాల్ జిల్లా ఆస్పత్రికి వెళ్లాల్సిందేనని తెలుపుతాం. అలంపూర్ చౌరస్తాలోని ఆస్పత్రిలో చికిత్స చేయడానికి ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఇర్షాద్, జిల్లా ప్రోగ్రాం అధికారి

సరిహద్దు కావడంతో ఇబ్బందులు..

తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దులో ఉన్న అలంపూర్ నియోజకవర్గ ప్రజలకు అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య అధికంగా ఉంది. డయాలసీస్, హార్ట్ సర్జరీలు, ప్రమాదాలు జరిగితే చికిత్స కోసం కర్నూల్‌కు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఖర్చులు చేస్తున్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగితే కర్నూల్‌కు తరలించాల్సిందే. ఇప్పటికైనా అలంపూర్ చౌరస్తాలోని ఆస్పత్రికి మోక్షం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నెట్టెంపాడులో ఘనంగా ఉర్సు



ఉత్సవాల్లో పాల్గొన్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత

ధరూరు: మండలంలోని నెట్టెంపాడులో హజ్రత్ మహబూబ్ సుభానీ ఉర్సు ఘనంగా నిర్వహించారు. మంగళవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవమ్మతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. సందర్భంగా వారు దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ బాబు, అమరవాయి కష్ణారెడ్డి, మండల నాయకులు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మనోరమ

కేటీదొడ్డి: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ మనోరమ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. గ్రామాల్లోని సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకునేలా కృషి చేయాలని సూచించారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేసిన సర్పంచులను అభినందించారు. సర్పంచుల పదవీకాలం ముగిసినప్పటికీ ఇలాగే ప్రజాసేవ చేస్తూ రాజకీయాల్లో ఇంకా ఉన్నత పదవులు పొందాలని వారు కోరారు. అనంతరం సర్పంచులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, డీటీ శివశంకర్, ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, ఏఓ మహలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



వాల్‌పోస్టర్ విడుదల చేసిన ఎంపీపీ, జెడ్పీటీసీ

కేటీదొడ్డి: యుక్త వయస్సు రాకుండా ఆడపిల్లలకు వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఎంవీఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని 'వద్దు పెళ్లి, బడికి పోతాం మేం' అనే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 21 సంవత్సరాలు దాటిన తర్వాతనే వివాహాలు చేయాలని, బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్‌అజార్ మోహిద్దీన్, ఎంపీఓ ఖాన్, సర్పంచులు తిక్కన్న గోపాల్, సూర్యప్రకాష్, చిన్నభీమరాయుడు ఉన్నారు.

జీఓ 19 తక్షణమే రద్దు చేయాలి



వడ్డేపల్లి తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాంతినగర్: 2023లో విడుదల చేసిన జీఓ 19ని పూర్తిగా రద్దు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ ఆధ్వర్యంలో వడ్డేపల్లి మండల తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో ఆయన మాట్లాడుతూ మాదాసి, మాదారి కురువలమని అధికారులను తప్పుదోవ పట్టించి ఎస్సీల ఉద్యోగ, విద్య, రాజకీయ రిజర్వేషన్లను, ప్రయోజనాలను పొందాలని ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు కుట్ర చేశారని, అలాంటి జీఓను వెంటనే రద్దుచేయాలని విన్నవించారు. జీఓ 19కి ఎలాంటి ఆధారాలు లేవన్నారు. 2016లో అప్పటి ఉమ్మడి మహబూబ్‌నగర్ కలెక్టర్ టీకే శ్రీదేవి ప్రొసిడింగ్స్ రిలీజ్ చేశారని, ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగిన జీఓ 19ని వెంటనే రద్దుచేసి ఎస్సీ కుల ధ్రువీకరణ అడిగిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నిజమైన దళితులకు అన్యాయం జరగకుండా వారి హక్కులను కాపాడాలని తహసీల్దార్‌ను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రేపల్లె లాజర్, కృష్ణకాంత్, రాకేష్, బుచ్చన్న, విల్సన్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



కస్తూర్బా పాఠశాలలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

ఉండవెల్లి: మండలంలోని కలుగొట్లలో వాయిస్ ఫర్ గరల్స్ దిశ కార్యక్రమంలో భాగంగా 10 రోజుల వ్యవధిలో కేజీబీవీ విద్యార్థులకు అత్యవసరమైన విషయాలను తెలియపరుస్తారని పేర్కొన్నారు. కొన్ని గ్రూపులుగా విద్యార్థులను ఏర్పాటు చేసి ఫీల్డ్ కో ఆర్డినేటర్‌లను నియమించి వారి ద్వారా పలు సూచనలు, సలహాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓ పరిమళ, పీఈటీ అరుణ తారా, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల పరస్పర దాడులు

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద సోమవారం పరస్పర దాడులకు పాల్పడ్డారు. మంగళవారం జమిచెడ్ శివారులో మరో సారి ఘర్షణకు దిగారు. పట్టణ, రూరల్ ఎస్‌ఐలు శ్రీకాంత్, ఆనంద్ వివరాల మేరకు.. మహబూబ్‌నగర్‌కు చెందిన కొందరు ట్రాన్స్‌జెండర్లు గద్వాలలో భిక్షాటన చేస్తున్నారు. ఈ క్రమంలో గద్వాలకు చెందిన కొందరు ట్రాన్స్‌జెండర్లు ఇక్కడ భిక్షాటన చేయరాదని.. స్థానికంగా ఉన్న వారు మాత్రమే భిక్షాటన చేయాలని సోమవారం ఉదయం కొత్త బస్టాండ్ వద్ద వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి ఒకరిపై ఒకరు పరస్పర దాడులకు పాల్పడ్డారు. స్థానికులు వారించినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని వివాదాన్ని సద్దుమణిగించారు. దాడులకు పాల్పడిన ట్రాన్స్‌జెండర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా.. మంగళవారం జమిచెడ్ శివారులో గద్వాలకు చెందిన ఓ ట్రాన్స్‌జెండర్‌పై మరోవర్గం ట్రాన్స్‌జెండర్లు దాడి చేసినట్లు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌జెండర్ల మధ్య నెలకొన్న వివాదం రోజురోజుకూ తారస్థాయికి చేరుతోంది. మరోవైపు ఇతర రాష్ట్రాలకు చెందిన ట్రాన్స్‌జెండర్లు సైతం ఇక్కడ భిక్షాటన చేయడం.. వారి మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు కూడా వివాదానికి తెరతీసినట్లు తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం: డీఎస్పీ

ట్రాన్స్‌జెండర్ల పరస్పర దాడుల ఘటనపై విచారణ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. దాడులకు కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాన్స్‌జెండర్ ముసుగులో భిక్షాటన చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలు, వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేదిలేదని హెచ్చరించారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం..



మానవపాడు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజేయుడు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే విజేయుడు తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలో సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండలకేంద్రం నుంచి చెన్నిపాడు వయా చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు గ్రామాల నుంచి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను, కలుకుంట్ల నుంచి అమరవాయి గుండా మానవపాడుకు వెళ్లే రహదారి నిర్మాణ పనులను త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. బోరవెల్లి, జల్లాపురం గ్రామాలకు ఆరు నెలలుగా మిషన్ భగీరథ నీరు లీకేజీ సమస్యలున్నాయని సర్పంచ్ విజేయ్‌కుమార్, వైస్ ఎంపీపీ సోమ్మన్నగౌడ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆరోగ్యకేంద్రం నుంచి ఆయా గ్రామాల వారీగా లెప్రసీ, టీబీ వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేయాలని సర్పంచ్ ఆత్మలింగారెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల పాఠశాలల్లో సమస్యలున్నాయనిఎంపీపీ రోశన్న తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలనిఎంపీపీ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. వైస్‌ఎంపీపీ సోమ్మన్నగౌడ్, ఎంఈఓ శివప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ధరణిషా, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులపై సర్పంచుల ఆందోళన



బిల్లులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచులు

గట్టు: సర్పంచుల పదవీకాలం మరో 24 గంటల్లో ముగియ నున్నదని, టార్గెట్లు పెట్టి పనులు చేయించిన అధికారులు, బిల్లుల చెల్లింపు విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఉపాధి హామీ అంశంపై ఏపీఓ ప్రసాద్ వివరిస్తున్న క్రమంలో పలు గ్రామాల సర్పంచులు ఒక్క సారిగా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచుల పదవీ కాలం ముగిసినా గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు ఎందుకు చెల్లించడం లేదని, అప్పులు చేసి, అభివృద్ధి పనులు చేపట్టామని సర్పంచులు పేర్కొన్నారు. చేసిన బిల్లులకు ఎంబీలు చేయించామని, వాటిని ఆన్‌లైన్‌లో ఎందుకు నమోదు చేయించలేదంటూ ఏపీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీడీఓ చెన్న య్య సభ్యులకు హామీ ఇచ్చారు. ఐకేపీ ద్వారా గ్రామాల్లో 13 కోట్ల రుణాలు ఇచ్చినట్లు ఏపీఎం భీమన్న తెలిపారు. ఇనాం భూములను డబ్బులిస్తే గుట్టుగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, రిజిస్ట్రేషన్‌కు అధికారులు అదనంగా డబ్బు వసూలు చేస్తున్నట్లు అంతంపల్లి సర్పంచు తెలిపారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న మాట వాస్తమని ఎంఈఓ తెలిపారు.

విద్యాభివృద్ధిపై తీర్మానం

మండలంలో విద్యాభివృద్ధికి చేసిన ప్రత్యేక తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. మండలంలో సంపూర్ణ అక్షరాస్యత శాతాన్ని పెంచడానికి ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని ఎంపీపీ కోరారు.

సర్పంచులకు సన్మానం



సన్మానం పొందిన సర్పంచులు

సర్పంచుల పదవీ కాలం ముగుస్తున్న తరుణంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, ఎంపీడీఓ చెన్నయ్యలు సర్పంచులను సన్మానించారు.

జాతిపితకు ఘన నివాళి



కోదండాపురంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని కోదండాపురంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, నాయకులతో కలిసి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గాంధీజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మధునాయుడు, నర్సింహనాయుడు, పుల్లారెడ్డి, మునిగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహదా ఖాతున్, రెవెన్యూ అధికారులు గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సామాజిక కార్యకర్త అంజి సాగర్, అబ్రహం పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, ఏఎన్‌ఎం సురేఖ గాంధీ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత గాంధీజీ అడుగుజాడలో నడవాలని కోరారు. అనంతరం ఏఎన్‌ఎం సురేఖ మాట్లాడుతూ కుష్టివ్యాధి వారోత్సవాల భాగంగా గ్రామంలో అవగాహన కల్పించారు. కుష్టి వ్యాధి ఒక శాపం కాదని, దీనికి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స ఉచితంగా అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ముందున్న గాంధీజీ విగ్రహానికి ఎంఈఓ కొండారెడ్డి, కస్తూర్బా ఎస్‌ఓ గోపీలతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్‌కు చెందిన గాంధీ స్మారక నిధి వారు కస్తూర్బాలో గాంధీజీ జీవితం, అనుసరణ విధానాలు అనే అంశంపై విద్యార్థినీలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉమామహేశ్వరి, లలితాదేవీ, అక్షయ, రమోల, సుజాత, స్వాతి, గీత, భారతి, మంగమ్మలు విజేతలుగా నిలువగా వారికి ఎంఈఓ కొండారెడ్డి, ఎస్‌ఓ గోపీలతలు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు కమ్మరి రమేష్, ఉపాధ్యాయులు రాజుసాగర్, నర్సింహులుగౌడు, అనురాధ, యూత్ సభ్యులు, నర్సింహులుగౌడు, శాంతప్ప, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అయిజ: గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. టీపీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవరాజు, సాంబశివుడు, కృష్ణారెడ్డి, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.



నందిన్నెలో గాంధీజీ చిత్రపటం వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎన్‌ఎం సురేఖ



ధరూరు తహసీల్దార్ కార్యాలయంలో వర్ధంతిలో పాల్గొన్న తహసీల్దార్



గట్టులో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సీజ్ చేసిన ఇసుక మాయం

రాజోళి: మండల కేంద్రంలో సోమవారం అధికారులు సీజ్ చేసిన ఇసుక మాయమైంది. అక్రమంగా ఇసుక డంపులు ఉన్నాయని సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సోమవారం వాటిని సీజ్ చేశారు. మంగళవారం ఉదయం నాటికి సీజ్ చేసిన ఇసుకలో సగం మాయమైంది. సీజ్ చేసిన ఇసుకను ఎవరు దొంగిలించారనే అనుమానాలు అధికారులు వేధిస్తుండగా, ఈ ఆరోపణలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.